సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జాలరి ఎండాడలో మహిళ అనుమానాస్పద మృతి

ఏయూ క్యాంపస్: స్థానిక జాలరి ఎండాడలో దుర్గాలమ్మ గుడి దగ్గర నివాసం ఉంటున్న వాడ మోదుల పోలమ్మ(53) ఆదివారం మధ్యాహ్నం అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడ మోదుల పోలమ్మ జాలరి ఎండాడలో దుర్గాలమ్మ గుడి దగ్గర చిన్న గదిలో నివాసం ఉంటోంది. ఈమె భర్త గతంలోనే మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. ఆదివారం ఆమె ఆకస్మికంగా మృతి చెందింది. అదే సమయంలో ఆమె ముక్కుకు ఉండే బంగారు ఆభరణాలు కనిపించడం లేదు. మృతురాలి సోదరి అంకమ్మ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బంగారం కోసం ఎవరైనా హత్య చేశారా?, లేక చనిపోయిన తరువాత బంగారం ఎవరైనా దొంగలించారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్‌రాజు, నాయకులు

సీతమ్మధార: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో బీజేపీ ఉత్తర కార్యాలయంలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురాంరాజు, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సురేష్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బి.ఎస్.రెడ్డికి అటల్ గౌరవ్ సమ్మాన్ పురస్కారం



అవార్డు అందుకుంటున్న బి.ఎస్.రెడ్డి

సీతంపేట: అంతర్జాతీయ మెజీషియన్, నగరవాసి బి.ఎస్.రెడ్డి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అటల్ గౌరవ్ సమ్మాన్-2023 అవార్డును కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి మహేంద్ర కలుభాయ్ ముంజపర చేతుల మీదుగా అందుకున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా అటల్ ఫౌండేషన్ సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కలిగి దేశవిదేశాల్లో తమ ప్రతిభ పాటవాలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారి సేవలకు గుర్తుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బి.ఎస్.రెడ్డిని నగరానికి చెందిన పలువురు మెజీషియన్లు అభినందించారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇది కదా అభివృద్ధి

సందర్శకులకు.. సౌకర్యంగా..

- జూలో అదనపు వసతులతో కొత్త శోభ



జూలో నిర్మాణంలో ఉన్న బయోస్కోప్ భవనం

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో అదనపు వసతులు సమకూరుతున్నాయి. వన్యప్రాణులతో పాటు సందర్శకుల సౌకర్యార్థం తలపెట్టిన పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూ అధికారులు వన్యప్రాణులకు అవసరమైన ఎన్‌క్లోజర్ల నిర్మాణంతో పాటు సందర్శకుల కోసం పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో జూ పార్కుకు కొత్త దనం సంతరించుకుంటోంది. రెండేళ్లుగా జూ పార్కులో అవసరమైన కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. ఇంకొన్ని భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక్కడ సుమారు రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) సామాజిక బాధ్యతలో భాగంగా జూ పార్కుకు రూ. 2 కోట్ల ఆర్థిక సహకారం అందించింది. ఆ నిధులతో జూ పార్కులో బయోస్కోప్ ఆధునికీకరణ, హిమాలయన్ బేర్ నైట్‌క్రాల్, హైనా మోటో, పాముల జోన్ వద్ద మరుగుదొడ్లు, ఖడ్గమృగం నైట్‌క్రాల్ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో బయోస్కోప్ భవనం నిర్మాణంలో ఉంది. వీటితో పాటు సుమారు మరో రూ.2 కోట్ల జూ నిధులతో మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్, రెండు స్లాత్ బేర్ ఎన్‌క్లోజర్లు, బార్కింగ్ డీర్ నైట్‌క్రాల్, డేక్రాల్ ఎన్‌క్లోజర్, సావనీర్ షాపు, రెండు చోట్ల చిన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. అవసరమైన ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకుల సౌలభ్యం కోసం పాత్‌వేలు నిర్మించారు. దీంతో సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాముల జోన్ వద్ద సందర్శకుల కోసం కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు



మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్



కొత్తగా నిర్మించిన హిమాలయన్ బేర్ నైట్‌క్రాల్

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 12వ వార్డులో పాదయాత్ర ప్రారంభం

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కోరారు. జీవీఎంసీ 12వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పాదయాత్ర చేశారు. నాలుగు రోజుల పాటు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర చేయనున్నారు. సోమవారం న్యూఅంబేడ్కర్ నగర్‌లో ప్రారంభమైన ఈ యాత్ర కనకదుర్గానగర్, ప్రజాశాంతినగర్, రాజీవ్‌నగర్, నెహ్రూనగర్, దుర్గానగర్ వరకు సాగింది. ఆయా కాలనీల్లో ప్రజలు ఎంవీవీకి ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలగకపోవడం, కుళాయిలు సరిగా రాకపోవడం, రోడ్లు పాడవడం తదితర సమస్యలు ప్రజలు చెప్పుకొన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. సంక్షేమ ఫలాలతో పేద, మధ్య తరగతి ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, పార్టీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, బోని శివరామకృష్ణ, సూర్యారావు, హుస్సేన్ అర్జున్, మోహన్, శ్రీనివాస్, సుజాత, రాజులమ్మ, వరహాలు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అసమానతలకు మూలం మనువాదం



మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న సమాఖ్య సభ్యులు

మద్దిపాలెం: సామాజిక అసమానతలకు మూలం మనువాదమేనని దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. 53వ వార్డు నరేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మనుధర్మ శాస్త్ర దహన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మనుస్మృతి వద్దు.. మానవత్వం ముద్దు, కుల వ్యవస్థకు మూలమైన మత గ్రంథాలను వీడాలని, కుల నిర్మూలనా పోరాటాలు వర్థిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 1927 డిసెంబర్ 25న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మనుధర్మ శాస్త్రాన్ని దహనం చేశారని గుర్తుచేశారు. మాకవరపాలెం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొరివి సుందరరావు మాట్లాడుతూ కుల వ్యవస్థలకు మనుస్మృతి మూలమైందన్నారు. కార్యక్రమంలో దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, సన్యాసమ్మ, గుడివాడ అప్పారావు, రవికుమార్, నూకరాజు, విజ్ఞానంద్ రాంప్రభు, రాంజీ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



పెదగదిలిలో ఇమాన్యుయేల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్ మహిళలు..



చర్చిలో అలంకరించిన క్రీస్తు జననం ఘట్టం



ఆరిలోవ ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో క్రిస్మస్ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆరిలోవ ప్రాంతంలోని చర్చిలను విద్యుత్ దీపాలు, బెలూన్లతో అలంకరించారు. ఏసుక్రీస్తు జన్మ స్థలంగా భావిస్తూ పశువుల శాలలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి చర్చిలు క్రైస్తవులతో సందడిగా మారాయి. కేకులు కట్‌చేసి ఏసుక్రీస్తు పాటలతో ప్రార్థనలు చేశారు. అంతా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. లీలాసుందరి నగర్‌లో ఆర్‌సీఎం చర్చి, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్, అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, తోటగరువు, పెదగదిలి, సింహగిరికాలనీ, హనుమంతవాక, విశాలాక్షినగర్, ఇందిరాగాంధీనగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి స్థానిక నాయకులతో కలసి లీలాసుందరి నగర్‌లో ఆర్‌సీఎం చర్చిని సందర్శించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ పాస్టర్లు వారితో ప్రార్థనలు చేయించారు.

ఆరిలోవ: స్థానిక మైకేల్ దత్తు చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 13వ వార్డు చర్చిలో కార్పొరేటర్ కెల్ల సునీత, 16వ వార్డు చర్చిలో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ప్రార్థనలు జరిపారు.

ఎంపీ కార్యాలయంలో..

మహారాణిపేట: లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏయూలో పని చేస్తున్న 28 రోజుల ఉద్యోగుల సమక్షంలో ఎంవీవీ కేక్ కట్ చేశారు. ఎంవీవీ స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మద్దిలపాలెం : మిరాకిల్ క్రిస్మస్ వేడుకలను సోమవారం బీచ్ రోడ్డులోని ఎంజీఎం పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామూల్ కర్మోజి మినిస్ట్రీస్ మిరాకిల్ చర్చి సొసైటీ వ్యవస్థాపకుడు బ్రదర్ శ్యామూల్ కర్మోజి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసు పుట్టిన రోజు సారాంశాన్ని వివరించారు. సిస్టర్ శ్రేష్ఠ, జోయెల్ సోహస్ బృందాలు ఆలపించిన క్రిస్మస్ గేయాలకు భక్తులు పరవశించిపోయారు. అనంతరం వేలాదిగా తరలించిన భక్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు.



లాసన్స్ బే కాలనీ క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



ఆరిలోవ మైకేల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



ఎంజీఎం పార్కులో క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న క్రైస్తవులు

కాపుల ద్రోహి పవన్ కల్యాణ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కాపు నేతలు

సీతమ్మధార: గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కాపులకు అన్యాయం చేసిందని, అటువంటి పార్టీకి మద్దతు పలికి కాపుల ఆత్మాభిమానాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలుగుదేశానికి తాకట్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ కాపు నేతలు మండిపడ్డారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కాపు యువత ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబును కాపు నాయకులు కలవాలంటే అపాయింట్మెంట్ ఇచ్చే వారు కాదని, అలాంటి పార్టీకి మద్దతు పలుకుతూ పవన్ కల్యాణ్ కాపుల ద్రోహిగా మారారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేసిన ప్రతి ఒక్కరినీ ఓడించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిని కొనసాగించేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్, సమ్మిట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

భీమునిపట్నం: అయోధ్య రామ మందిరానికి స్వామి వారి అక్షింతల శోభా యాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సంద్బంగా కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ ఈ పవిత్ర అక్షింతలకు వారం రోజులుగా నెహ్రూ స్కూల్ వద్ద నున్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. వీటిని అన్ని దేవాలయాలకు, ఇంటింటికీ అందిస్తామని తెలిపారు. ముమ్ముడిశెట్టి సత్యానందం, వంశీ, పల్లా విజయకుమార్, పోలుబోతు విజయ, కంటుభుక్త సునీత పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత



1047వ రోజు ఉక్కు దీక్షలో సంస్థను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సర్వోన్నతమైన దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం, 1047వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యుఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీఏ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ సింగరాయిమెట్ట ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పైడి మానస బీటెక్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. తరచూ అక్కడి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సేవకు వెళ్తుంటారు. సోమవారం ఉదయం 4 గంటల సమయంలో సేవకు వెళ్తానని చెప్పి సదరు యువతి ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం దాటినా రాకపోవడంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో సోమవారం రాత్రి తండ్రి పైడి నర్సింగరావు ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

శ్రీరాముడిగా అప్పన్న



రామాలంకారంలో అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అదిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాకర్స్ క్లబ్ విజయోత్సవం

మురళీనగర్: ఇటీవల నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ మహా సమ్మేళనంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సాధించిన ప్రగతిపై వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం విజయోత్సవం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ప్రతిభ ఆధారంగా 8 అవార్డులతోపాటు ఆరు ప్రాయోజిత పురస్కారాలు పొందారు. ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డులు పొందడం వాకర్స్ క్లబ్ చరిత్రలో ఇదే తొలిసారని చంద్రమౌళి తెలిపారు. అవార్డు గ్రహీతలను, ప్రస్తుత కార్యవర్గ సభ్యులను క్లబ్ సభ్యులు అభినందించారు.

చంద్రబాబు హయాంలో అంగన్‌వాడీలకు అన్యాయం

తగరపువలస : తాను విశాఖ ఎంపీగా పోటీ చేసి, కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు న్యాయం చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సోమవారం ఆయన తగరపువలసలో మాట్లాడారు. అనంతరం చిట్టివలసలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి వారిని ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు గతంలో అంగన్‌వాడీలకు చాలా అన్యాయం చేశాడన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చాలని తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్లు తెలిపారు. అయినా ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవన్నారు. మూడు నెలల సమయమిస్తే తాను ఎంపీ అయ్యాక వారి డిమాండ్లు పరిష్కరిస్తానన్నారు. చంద్రబాబు, కేసీఆర్, మోదీకి తాను కోట్లాది రూపాయల సాయం అందించానన్నారు. తాను పుట్టిన చిట్టివలస గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. టెన్త్ ఫెయిలైన తనకు జ్యూట్‌మిల్లులో రూ.300 ఉద్యోగం లభించక ఆత్మహత్య చేసుకుందామనుకున్న సమయంలో దేవుడు అండగా నిలిచి ప్రపంచ దేశాల్లో సువార్త వినిపించే సదవకాశం కల్పించారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు చేసుకున్నారు. మరోవైపు తన చిన్ననాటి స్నేహితులను పలకరించారు. తాను చిట్టివలస విడిచి 44 ఏళ్లు పూర్తయినా, ఇప్పటికీ అందరూ గుర్తున్నారని పుట్రేవు రంగధామారావు, జోసఫ్ జేమ్స్ తదితరులను గుర్తించి పేరు పేరునా పలకరించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
✆ 9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com